క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూలలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం పర్యటిస్తారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన నాయకులు



వంగూరు: కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్‌ని మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్ తోపాటు మరికొందరు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని మంత్రి సూచించారని వివరించారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



కల్వకుర్తిరూరల్: పేద విద్యార్థులకు అండగా ఉంటామని క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలో క్లాస్‌మెట్ క్లబ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి నూతన సభ్యులను చేర్చుకొని రశీదులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులో ఆసక్తి ఉండి ఆర్థిక పరిస్థితి లేని విద్యార్థులకు చేయూతనిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా బాధ్యులు శోభన్‌బాబు, శ్రీధర్, అధ్యక్షుడు రాజేందర్, లక్ష్మీనర్సింహారావు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బిజినేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు గ్రామంలో రోడ్డు దాటుతున్నాడు. శ్రీశైలం నుంచి తాండూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొన్నది. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వీధిలైట్లు వేయాలని వినతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లిలో ఉన్న ఆరు, ఏడు వార్డులలో గత నెల రోజుల నుంచి వీధి లైట్లు వెలగడం లేదని ఎంపీడీఓ పట్టాభిరామరావుకు మంగళవారం గ్రామానికి చెందిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ టీం సభ్యులు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వీధి లైట్లు వేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తెలకపల్లి: మండలంలోని గట్టురావిపాకుల గ్రామానికి చెందిన తగిలి శ్రీశైలం అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం గ్రామస్తులు విరాళాలు సేకరించి బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం రూ. 37,500 లు అందజేసి మానవత దృక్పథాన్ని చాటుకున్నారు.

సాహిత్యంతో సామాజిక రుగ్మతలు దూరం



కల్వకుర్తిరూరల్: సాహిత్యంతో సామాజిక రుగ్మతలు దూరం అవుతాయని అభయాంజనేయ స్వామి దేవస్థానం నిర్వాహకుడు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని హరిహరా టౌన్‌షిప్‌లో వెలసిన అభయాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రముఖ కవి కరునాటి రఘురాంగౌడ్ రచించిన ఆంజనేయ శతక పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కల్వకుర్తి సాహితీ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆద్యంత రసవత్తరంగా కొనసాగింది. కార్యక్రమంలో భూమానందగిరి స్వామి, సుధాకర్, లక్ష్మారెడ్డి, రవిచంద్ర, శీనయ్యగౌడ్, పలువురు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్లపై సర్వే



చారకొండలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శ్యాంసుందర్



కల్వకుర్తి మండలం మార్చాలలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ వెంకటరాములు

తెలకపల్లి: మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ సర్వేలో భాగంగా మండంలో రాంరెడ్డిపల్లి, చిన్నముద్దునూర్, బండపల్లి, గట్టురావిపాకుల, గౌతంపల్లి, గడ్డంపల్లి, అనంతసాగర్, దాసుపల్లి గ్రామాలను ఎంపీడీఓ కృష్ణయ్య సందర్శించారు. లబ్ధిదారుల వివరాలను నమోదు చేసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పనులు, అంతర్గత రోడ్లను పరిశీలించారు. గడ్డంపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించి పనులు పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. గట్టురావిపాకుల పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామపంచాయితీ సిబ్బందికి సూచించారు. అనంతసాగర్‌లో గ్రామ పంచాయితీని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట కార్యదర్శులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి ఎక్కడ కూడా లీకేజీ కాకుండా నీటి వృథాను అరికడతామని ఎంపీడీఓ వెంకటరాములు అన్నారు. మంగళవారం మండలంలోని మార్చాలలో ఆయన పర్యటించారు. పలు కాలనీలకు వెళ్లి నీటి సరఫరా తీరును పరిశీలించారు. గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్ చేయాలని కార్యదర్శి రమేష్‌కు సూచించారు. ఇంటింటి నల్లా కనెక్షన్లపై సర్వే చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగాల: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లపై అధికారులు సర్వే పనులు చేపట్టారు. మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో అధికారులు మండలంలోని లింగాల, అప్పాయపల్లి, శ్రీరంగాపూర్, ఎంసీ తండా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్ని నల్లా కనెక్షన్లు ఉన్నాయో పరిశీలించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సక్రమంగా నీటి సరఫరా చేయడం లేదని ఆయా గ్రామస్తులు అధికారుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీఓ కర్ణానాయక్, ఏఈ బాల్‌రాంనాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి, కుప్పగండ్ల గ్రామాల్లో ఇంటింటికి నల్లా కనెక్షన్లపై ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి ఇంటింట సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జనాభా వివరాలు, కుళాయిల నీటి కనెక్షన్ వంటి వివరాలు, ఆధార్‌కార్డుల నెంబర్లను నమోదు చేసుకుంటున్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. కార్యదర్శులు ఫైయాజ్, మంజుల, మిషన్ భగీరథ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై క్షేత్ర స్థాయిలో డీఎల్‌పీఓ శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి గణేష్ సర్వే నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. వారివెంట ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.



లింగాలలో..



అనంతసాగర్‌లో ..



వెల్దండ మండలం కంటోనిపల్లిలో

పంటల సాగు పద్ధతులపై అవగాహన

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలోని రైతువేదికలో రైతు నేస్తం, రైతులు, వ్యవసాయ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి హైదరాబాద్ నుంచి మాట్లాడారు. వానాకాలం సాగు పద్ధతులపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాలలో రైతులకు వ్యవసాయ సాగుపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని వారు సూచించారు. పంటల సాగుపై శాస్త్రవేత్తల ద్వార విత్తనాలు ఎంచుకునే విధానం, సాగు విధానం గురించి అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ డివిజన్ ఏడీఏ రవి, ఏఓలు శ్రీరాం, రమేష్, డివిజన్ ఏఈఓలు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజు, రైతులు, నాగపూర్ విష్ణు, బండ శ్రీనివాసులు, పెరుమాల శ్రీనివాసులు, పెరుమాల యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, రైతులు

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని 17వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డు ప్రజలు మంగళవారం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు మాట్లాడుతూ వార్డులో ఇప్పటి వరకు రోడ్డు సౌకర్యం లేదని కనీసం మట్టి రోడ్డు అయిన వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ చేపట్టిన పనులను మధ్యలోనే నిలిపివేశారని, భగీరథ పైపులు వేసి పనులు పూర్తి చేయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, కందికొండ గీత, అశోక్, రామయ్య, యాదయ్య, వెంకటయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గృహజ్యోతి పథకం అందరికి అమలు చేయాలి

చారకొండ: గృహజ్యోతి పథకం అందరికి అమలు చేయాలని మండల బీజేపీ ఉపాధ్యక్షుడు సీమర్ల సత్యం యాదవ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రతి ఒక్కరికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జూపల్లి, చారకొండ తదితర గ్రామాల్లో కొంతమందికి మాత్రమే జీరో బిల్లులు అందజేశారని వాపోయారు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో పథకం అమలు చేసి ప్రతి వినియోగదారునికి జీరో బిల్లు అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు పర్వతాలు, శ్రీను, శివ,అంజి, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి పథకాన్ని మున్సిపాలిటి మండలంలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందించాలని బీజేపీ జిల్లా నాయకులు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ గంగాధర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. 200 యూనిట్లు వాడుకున్న ప్రతి ఒక్కరికి గృహజ్యోతి అమలు చేస్తామని చెప్పినప్పటికి ఇప్పటి వరకు చాలామందికి ఆ పథకం అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మారని సర్కార్ బడుల స్థితిగతులు



టంగాపూర్ కాలనీలో నిలిచిన ప్రాథమికోన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా సర్కారు బడుల స్థితిగతులు మారడం లేదు. బుధవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నా ఇప్పటికి పనులు పూర్తి కాలేదు. పట్టణంలోని టంగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల భవనం కూల్చివేసి గతేడాది నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. గత విద్యా సంవత్సరమే సమీపంలో ఉన్న మహేంద్రనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించారు. రెండు పాఠశాలలు ఒకే దగ్గర అసౌకర్యాల మధ్యనే చదువులు కొనసాగించారు. ఈ ఏడాదైనా భవనం పూర్తి చేస్తారని ఆశించినా... కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదని అర్ధాంతరంగా భవన నిర్మాణ పనులు నిలిపివేయడం విశేషం.

కొనసాగుతున్న పాఠశాలల పనులు

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం మన ఊరు మన బడి పథకానికి శ్రీకారం చుట్టింది. కల్వకుర్తి మండలంలో 20 పాఠశాలలో అదనపు గదులు, వంట గదులు, టాయిలెట్స్ నిర్మాణం కోసం దాదాపు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మినహా మిగతా పాఠశాలలో 80 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆయా గ్రామాల పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల కోరుతున్నారు.



అచ్చంపేటలో అభ్యుదయ పాఠశాల నూతన భవనం

నేడు కొండారెడ్డిపల్లికి కలెక్టర్, ఎంపీ రాక

వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి బుధవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లురవి రానునట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని శిక్షణ పొందిన 40 మంది మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలిస్తారని వివరించారు.

ఎంఈఓను నియమించాలి

కోడేరు: మండలానికి ఎంఈఓను నియమించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దాదాపు నాలు సంవత్సరాలు కావొస్తున్నా ఎంఈఓ పోస్టు ఖాళీగా ఉందని వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంఈఓను నియమించకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు సమయ పాలన పట్టించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని పలువురు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపీని సన్మానించిన నాయకులు



వెల్దండ: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ నియోజక అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తెల్కెపల్లి శేఖర్, సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, విమల్, తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి ఒక్కరు అటవీశాఖకు సహకరించాలని ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ కోరారు. ట్విట్టర్, వాట్సప్, సోషల్ మీడియాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వన్య ప్రాణులు, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు యూనిఫాం సిద్ధం



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంను మంగళవారం ఆయా పాఠశాలల వారిగా ఐకేపీ ఏపీఎం శేఖర్ సిద్ధం చేస్తున్నారు. మండలంలో 23 ప్రాథమిక పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలలు, 1 కేజీబీవీతో కలిపి మొత్తం 37 పాఠశాలలకుగాను బాలికలు 1578, బాలురు 1351 మొత్తం 2929 మంది విద్యార్థులకు సంబంధించి విద్యాశాఖ వారు ఇచ్చిన లెక్కల ప్రకారం యూనిఫాంను తయారు చేశామన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది లక్ష్మన్, పార్వతమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు

వెల్దండ: మండల కేంద్రంలో బొడ్రాయి మూడో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నుంచి ప్రత్యేక అలంకరణ చేసిన బోనంతో డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. మహిళలు బొడ్రాయికి నీటిబిందెలతో జలాభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు కురువాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ , మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, నాయకులు విజేందర్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, ఎర్రశ్రీనుముదిరాజ్, కసారపు వెంకటయ్యముదిరాజ్, మల్లయ్యముదిరాజ్, బాల్‌రాజ్, ప్రభాకర్, మల్లేష్, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపురంలో రైతు కమిటీ ఆధ్వర్యంలో జములమ్మకు ఘనంగా బోనం ఎత్తి మొక్కులు చెల్లించుకున్నారు. అంగరంగ వైభవంగా డోలుడప్పులతో ఆటపాటలాడుతూ ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో రైతు కమిటీ అధ్యక్షుడు తూముకుంట ప్రభాకర్‌రెడ్డి, గుర్రంపల్లి కురుమయ్య, లోకంగౌడ్, రాముడు, మేకల గోపాల్, మహేష్, సంజీవరెడ్డిలు పాల్గొన్నారు.



గోపులాపురంలో బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

కూలి చెల్లించాలని నిరసన

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయ ఎదుట జాతీయ ఉపాధి హామీ కూలి డబ్బుల కోసం మంగళవారం కూలీలు నిరసన తెలిపారు. మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు పనులు చేసినా డబ్బులు రావడం లేదని దాదాపుగా 30 మంది కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గతేడాది దాదాపుగా 10 నెలలు పనులు చేసిన డబ్బులు ఇవ్వలేదన్నారు. విషయం తెలుసుకున్న ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడులు కార్యాలయానికి చేరుకొని కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డుకు ఏ ఖాతా నంబర్‌కు డబ్బులు జమ చేస్తున్నామన్నారు. గతేడాదికి సంబంధించిన డబ్బులు గురించి 10 రోజుల్లో పోస్టాఫీసు వారి నుంచి నివేదిక తీసుకొని సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, రాజశేఖర్, లాలయ్య, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ ఈశ్వర్‌జీ

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక అచ్చంపేట కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. అచ్చంపేట–నాగర్‌కర్నూల్ కమిటీ అధ్యక్షుడు సాయిశంకర్, మనోహర్, సభ్యులు రాధాకృష్ణ, ఆంజనేయులు, నిరంజన్, వెంకటయ్య, వరుణ్, శశిప్రితం, రమాదేవి, చంద్రకళ, సుజాత, మంజుల, ప్రసన్నలక్ష్మి, హంసిని తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి



పెంట్లవెల్లి: ఉపాధిహామీ కూలీల పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ మోహన్‌కృష్ణకు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గోపాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ రోజువారి కూలీవేతనం రూ.600కు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఈశ్వర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, శ్రీనివాసులు, రాజు, నవీన్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవసరం



లింగాల: ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రంలోని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సెలర్ ఎండీ మన్సూర్ కోరారు. మంగళవారం మండలంలోని శాయిన్‌పేటలో సొసైటీ ఫర్ ట్రాన్స్‌పర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతాలను తెరిచే సమయంలో సమర్పించాల్సిన పత్రాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన యోజన్, సుకన్య యోజన, తదితర పథకాల గురించి కూలీలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సెలర్ రూపేష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



అచ్చంపేట: అచ్చంపేట 18వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ గోపిశెట్టి శివ మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఉదయం 11గంటలకు అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడుపై అవిశ్వాస తీర్మానంకు ఒక రోజు ముందు పార్టీ మారడం పట్ల చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడపాల గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, మహిపాల్‌రెడ్డి, అంతటి మల్లేష్, మాజీ ఎంపీటీసీ రాములు, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు వెంటనే పంచాలి



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని శివారుగల సర్వే నెంబర్ 449లో ఉన్న భూమిని పేదలకు వెంటనే పంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నంబర్‌లో గల 64 ఎకరాల 13 కుంటల భూమిని పరిశీలించారు. భూమిలేని పేదలను గుర్తించి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమంతు, శ్రీనివాస్, గోపాల్, బాలస్వామి, ఎల్లయ్య, రాముడు, అహ్మద్‌లు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

కొల్లాపూర్: యాదాద్రి భువనగిరి జిల్లాలోని పుట్టపాకలో ఫొటోగ్రాఫర్ లింగస్వామిపై దాడిని నియోజకవర్గ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం నాయకులు ఖండించారు. సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీయలేదని ఫంక్షన్‌కు వచ్చిన వారు దాడి చేయడం దారుణమన్నారు. లింగస్వామిపై దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు కట్టా శ్రీనివాసులు, మహెబూబ్, రమేష్‌గౌడ్, హసన్‌పీరా తదితరులున్నారు.